క్లుప్తంగా

నేడు హనుమాన్ జయంతి

పోరుమామిళ్ల : హనుమాన్ జయంతి సందర్భంగా పోరుమామిళ్ల మల్లకతువ దగ్గరున్న శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త చెన్నయ్య తెలిపారు. 108 కలశాలతో మహిళలు పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహిస్తారన్నారు. అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామిచే ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు.

- మండలంలోని చల్లగిరిగెల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ గ్రామాల బృందాలతో భజన జరుగుతుందన్నారు.

ఘనంగా అనఘాష్టమి



దత్తాత్రేయస్వామి చిత్రపటం, యంత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో శుక్రవారం అనఘాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దత్తాత్రేయస్వామి మూలవిరాట్, దత్తాత్రేయస్వామి, అనఘాదేవిల ఉత్సవ మూర్తులకు విశేష పూజా కార్యక్రమాలను చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీపాద వల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో దత్తాత్రేయస్వామి చిత్రపటం, యంత్రాన్ని భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

సబ్‌జైలు సందర్శన



సబ్‌జైలు సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న జడ్జి వై.జె.పద్మశ్రీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ వై.జె.పద్మశ్రీ శుక్రవారం సందర్శించారు. ఇందులో భాగంగా జైలు పరిసరాలు, వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్‌జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను సత్ప్రవర్తనతో మార్చు తెచ్చుకున్నప్పుడే తమ జీవితానికి సార్థకత ఉంటుందని అన్నారు. అలాగే ఖైదీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, కోర్టు సిబ్బంది, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పరీక్షలో ప్రతిభ



పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో కోచ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైస్పేస్ తైక్వాండో క్రీడాకారులు ఇస్మాయిల్, తస్లీమ్, యువరాజ్, పవన్‌సాయిలు జాతీయ స్థాయి రెఫరీ సెమినార్‌కు హాజరయ్యారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం గద్వాల్‌లో జరిగిన ఈ సెమినార్‌లో అంతర్జాతీయ రెఫరీ తిరుమల జైపాల్ మెలకువలు, పాయింట్‌లు వేసే పద్ధతి వివరించి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మైస్పేస్ విద్యార్థులు ప్రతిభ కనపరచి ఉత్తీర్ణులయ్యారని కోచ్ సలీం తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరం పరిశీలన



మాట్లాడుతున్న డాక్టర్ మార్కారెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విశ్రాంత జిల్లా డిప్యూటీ ఆరోగ్య వైద్యాధికారి మార్కారెడ్డి పరిశీలించారు. శుక్రవారం సెలవురోజు కూడా గ్రంథాలయం తెరచి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించిన లైబ్రేరియన్ ఆఫ్రిదిని అభినందించారు. విద్యార్థులతో కథలు, శతకపద్యాలు చెప్పించారు. జనరల్ నాలెడ్జిపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా గ్రంథాలయంలో గడుపుతున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గసభ్యులు దాదాపీర్, ఉపాధ్యాయుడు పీర్‌బాషా పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పోరుమామిళ్ల : స్థానిక ఆర్టీసీ బస్టాండు దగ్గరున్న లాడ్జి వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి చెప్పారు. వారి వద్ద నుంచి రూ.4630 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.



హోమస్‌పేట ప్రాథమిక పాఠశాల



అధునాతన బెంచీలు



ఆకట్టుకునేలా వాల్ పెయింటింగ్

సర్కారీ బడి.. సౌకర్యాల ఒడి

- రూపురేఖలు మారిన ప్రభుత్వ పాఠశాలలు
- నాడు–నేడుతో అభివృద్ధి పనులు
- కార్పొరేట్‌కు దీటుగా వసతులు
- మెరుగైన విద్యా బోధన

ప్రభుత్వం నాడు– నేడు కార్యక్రమం ద్వారా సర్కారు బడులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంతో రూపురేఖలు మారిపోయాయి. అధునాతన బాత్‌రూమ్‌లు, నీటి సరఫరా, విద్యుదీకరణ, ఫర్నీచర్, గ్రీన్‌చాక్ బోర్డ్స్, భవనాల మరమ్మతులు, ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటు, ప్రహరీ, కిచెన్ షెడ్ నిర్మాణం, అదనపు తరగతి గదులు, డిజిటల్ లెర్నింగ్ బోర్డులు వంటి మౌలిక వసతులు సమకూరడంతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రతి విద్యార్థి చక్కగా చదువుకునే వాతావరణం కలిగింది. చదువుల మీద పెట్టే ప్రతి పైసా.. పవిత్రమైన పెట్టుబడిని, పిల్లలను బాగా చదివించినప్పుడే వాళ్ల జీవితాలు మారుతాయన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం నెరవేరుతోంది. దీంతోపాటు అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు అమలు చేయడంతో.. స్కూళ్లకు హాజరయ్యే విద్యార్థుల శాతం పెరుగుతోంది. త్వరలో పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో.. ప్రొద్దుటూరు మండలంలోని సర్కారు స్కూళ్లపై అందిస్తున్న ప్రత్యేక కథనం.

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలంటే విద్యార్థులు విముఖత చూపే వారు. సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడేవారు. మరుగుదొడ్లు, బెంచీలు, ఫ్యాన్ల కొరత ఉండేది. సరిపడ తరగతి గదులు ఉండేవి కాదు. తాగునీటి వసతి లేక ఇబ్బంది పడేవారు. ఇది ఒకప్పటి పరిస్థితి. ప్రస్తుతం సర్కారీ బడులు సౌకర్యాలతో అలరారుతున్నాయి. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తలచిన వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులు చేసింది. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించింది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పటిష్టమైన విద్యాబోధనకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. మనబడి నాడు–నేడు కార్యక్రమం ప్రవేశపెట్టింది. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపొందించింది. విద్యార్థులు కింద కూర్చోకుండా ప్రతి తరగతికి అధునాతన బెంచీలు ఏర్పాటు చేసింది. విద్యార్థులకు జగనన్న కానుక ద్వారా బ్యాగు, నోటు, పాఠ్యపుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, వర్క్‌బుక్స్, యూనిఫాం, బెల్ట్ అందజేస్తోంది.
- మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పేరుతో పౌష్టికాహారం అందిస్తోంది. రోజుకో మెనూ అమలు చేస్తూ వారానికి 5 కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావ అందజేస్తోంది.
- పాఠశాలల్లోనే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, సురక్షిత నీరు అందజేస్తున్నారు.
- డిజిటల్ విద్యను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేరువ చేశారు.
- ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐవీఎఫ్) ద్వారా విద్యను బోధిస్తున్నారు.
- బైజూస్ కంటెంట్ విద్యను అందజేసేందుకు విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు.
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు, వసతులు కల్పించారు.
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్యను బోధిస్తున్నారు.



దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్

ప్రభుత్వ పాఠశాలల వివరాలు

మొత్తం: 110

నాడు–నేడుతో అధునీకరించినవి

మొదటి విడత:	38
నిధులు:	రూ.9.80 కోట్లు
రెండవ విడత :	67
నిధులు:	రూ.22.9 కోట్లు
మూడో విడత:	34
నిధులు :	రూ.4.42 లక్షలు



హ్యాండ్ వాష్ కుళాయిలు



దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్‌లోని బాత్‌రూమ్



వంట గది



వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్ ముఖద్వారం

4న ప్రొద్దుటూరులో ఆంక్షలు



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జూన్ 4న ప్రొద్దుటూరులో పూర్తి స్థాయిలో ఆంక్షలు విధిస్తున్నట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ రోజు విజయోత్సవ ర్యాలీలను పూర్తిగా నిషేధించామన్నారు. 6వ తేది వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఎవరు కోడ్ ఉల్లంఘించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రొద్దుటూరు పట్టణంతో పాటు రూరల్, రాజుపాళెం మండలాలను 25 సెక్టార్లుగా విభజించామన్నారు. ఒక్కో సెక్టార్‌కు ఒక అధికారిని కేటాయించి 10 మంది సిబ్బందితో బందోబస్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మ వార్డులు, గ్రామాలను గుర్తించి పికెట్‌లను ఏర్పాటు చేశామన్నారు. 3వ తేది నుంచి 4 వరకు ప్రొద్దుటూరు పోలీసుల ఆధీనంలో ఉంటుందన్నారు. 4న గ్రామాల నుంచి ప్రొద్దుటూరుకు ఎవ్వరూ రావద్దని, పట్టణంలో పూర్తిగా కర్ఫ్యూ వాతావరణం ఉంటుందని సూచించారు. బ్యాంకులు, హాస్పిటళ్లకు మినహాయింపు ఉంటుందన్నారు. ప్రజలకు ఏదైనా అత్యవసరమైతే పోలీసులకు చెప్పాలన్నారు. 4 ఉదయం నుంచి 5వ తేది వరకు కర్ఫ్యూ ఉంటుందని చెప్పారు. ఈ విషయాన్ని పట్టణంతోపాటు గ్రామాల్లో మైకులు, చాటింపు ద్వారా తెలియచేసినట్లు తెలిపారు. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తామని ముందుకు వచ్చారన్నారు. ప్రజలు కూడా సహకరించాలన్నారు. అన్ని పార్టీలకు చెందిన 139 మందిని సమస్యాత్మక వ్యక్తులుగా గుర్తించామని తెలిపారు. కౌంటింగ్ రోజు ఇబ్బంది కలిగించే అవకాశం ఉన్న ఆరుగురిని జిల్లా బహిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తామన్నారు. కౌంటింగ్‌కు వెళ్లి తిరిగి వచ్చే వరకు పోలీసు భద్రత ఉంటుందని తెలిపారు. ప్రొద్దుటూరులో ప్రశాంత వాతావరణం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 64 సీసీ కెమెరాలతో నిఘా పెట్టడంతోపాటు ప్రత్యేకంగా టీంలను కేటాయించామని అన్నారు. అనవసరంగా రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైండోవర్ అయిన వారు కొందరు తిరిగి గొడవ పడటంతో వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించామన్నారు. సమావేశంలో సీఐలు రమణారెడ్డి, శ్రీకాంత్, శ్రీధర్‌నాయుడు, యుగంధర్, శివశంకర్, అబ్దుల్‌కరీం, ఎస్‌ఐలు మంజునాథ్, హైమావతి పాల్గొన్నారు.

ప్రాణాంతకం.. పొగాకు వాడకం



ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



చాపాడు : పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : పొగాకు వాడకం ప్రాణాపాయమని కామనూరు ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని పెద్దశెట్టిపల్లె-2 సచివాలయంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తర్వాత గోపవరం, సోములవారిపల్లె గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు బీపీ వరప్రసాద్, చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి మస్తాన్, అప్తాల్మిక్ అధికారి తేజ, ఫార్మసిస్టు శ్రీధర్, సీహెచ్‌ఓలు సంధ్య, అంజలి, గౌతమి, నాగలత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో..

సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు శివప్రసాద్‌రెడ్డి, హిమబిందు, వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సభ్యులు చంద్రఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

చాపాడు : మండల పరిధిలోని చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నక్కలదిన్నెలోని ఆరోగ్య కేంద్రంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు డాక్టర్లు రాజేష్ కుమార్, కావ్యమాధురి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారి ఓబులేసు, ఎంపీహెచ్‌ఈఓ రాఘవయ్య, సూపర్‌వైజర్లు సరస్వతి, బాబురెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు



పల్లవోలు చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

చాపాడు : చాపాడు మండల పరిధిలోని చెరువులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ శాఖ డీఈఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పల్లవోలు చెరువు, రామసుబ్బమ్మ చెరువులను శుక్రవారం ఆయన పరిశీలించారు. చెరువులకు అనుబంధంగా ఉన్న పంట పొలాల్లో అనుమతి లేకుండా వేస్తున్న లే అవుట్లను పరిశీలించి చాపాడు మండల రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చెరువులను ఆక్రమిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులకు అనుబంధమైన కాలువలను ఆక్రమించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లే అవుట్లు వేయాలని, ప్రభుత్వ స్థలాల్లో వేసే లేఅవుట్లను పరిశీలించి కొలతలు వేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజారెడ్డి, మండల సర్వేయర్ సాయిలత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఈసెట్ ఫలితాల్లో ప్రతిభ



హేమంత్‌రెడ్డి



గురుప్రశాంత్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొత్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఇటీవల విడుదలైన ఈసెట్-2024 ఫలితాల్లో ప్రతిభ కనపరచారు. రాష్ట్ర స్థాయిలో ఈఈఈ విభాగంలో హేమంత్‌కుమార్ 50వ ర్యాంకు, గురుప్రశాంత్ 78, జ్యోతీశ్వరరెడ్డి 84, తిరుమలేష్ 112, నవీన్‌కుమార్ ఆచారి 193 ర్యాంకు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు, ఎలక్ట్రికల్ విభాగాధిపతి కె.మంజునాథ్, సీనియర్ లెక్చరర్ సమీవుల్లా, అధ్యాపకులు అభినందించారు.

పాలిటెక్నిక్ ఐచ్ఛికాల ఎంపికలో మార్పులు

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలన, ఐచ్ఛికాల ఎంపికల షెడ్యూల్‌లో మార్పులు జరిగాయని ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసీహెచ్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3న జరగాల్సిన ధ్రువపత్రాల పరిశీలన 6వ తేదీకి వాయిదా పడినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నుంచి జరగాల్సిన ఐచ్ఛికాల ఎంపిక ప్రక్రియ జూన్ 7 నుంచి 10వ తేదీ వరకు జరుగుతుందని వివరించారు. జూన్ 14వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ మార్పులు గమనించాలని కోరారు.

విద్యా హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలి

ప్రొద్దుటూరు : విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు జహీర్, ప్రేమ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు యథేచ్ఛగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యాహక్కు చట్టానికి భిన్నంగా వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆ జీఓలు రద్దు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : జీఓ నంబర్లు 26, 27, 28ను ప్రభుత్వం రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 12న జీఓ నంబర్ 26, 27, 28లను విడుదల చేసి గ్రూప్ 2, 3, 4లో గల టైపు రైటింగ్ అర్హతను తొలగించి, సీపీటీ కోర్స్ పాస్ అవ్వాలనే నిబంధన విధించిందన్నారు. దీనివల్ల ఇప్పటికే టైప్ పాస్ అయిన నిరుద్యోగ అభ్యర్థులు మరొక కోర్స్‌కు వెళ్లడమంటే శ్రమ, ఖర్చుతో కూడుకున్నదన్నారు. సమావేశంలో భరత్, రాహుల్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మానం



ప్రొద్దుటూరు క్రైం : నరసింహారెడ్డి దంపతులను సన్మానించిన శ్రేయోభిలాషులు, అధికారులు



రాజుపాళెం : సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది



బద్వేలు అర్బన్ : బాలమ్మ దంపతులను సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

ప్రొద్దుటూరు క్రైం : ఉద్యోగ విరమణ చేసిన వారికి శుక్రవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు ఆర్అండ్‌బీ ఈఈ డీవీ నరసింహారెడ్డి పదవీ విరమణ సన్మాన సభను మోడంపల్లె బైపాస్ రోడ్డులోని కేఎంహెచ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ పి.మహేశ్వరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ సీపీ రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు, బంధువులు, శ్రేయోభిలాషులు హాజరయ్యారు. విధి నిర్వహణలో ఈఈ నరసింహారెడ్డి అందించిన సేవలను వారు కొనియాడారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల ఏర్పాటులో ఆయన కృషి మరువలేనిదని చెప్పారు. అనంతరం పూలమాలలు, శాలువలతో నరసింహారెడ్డి దంపతులను సన్మానించారు.

ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి

రాజుపాళెం : పోలీసు శాఖలో గత 37 ఏళ్లుగా పని చేసిసి పదవీ విరమణ పొందిన ఏఎస్‌ఐ పుత్తా సుబ్బారెడ్డి సేవలు మరువలేనివని ప్రొద్దుటూరు రూరల్ సీఐ రమణారెడ్డి పేర్కొన్నారు. రాజుపాళెంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఏఎస్‌ఐ సుబ్బారెడ్డికి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రొద్దుటూరు ట్రాఫిక్, వన్‌టౌన్, ముదిగుబ్బ సీఐలు యుగంధర్, శ్రీకాంత్, కృష్ణంరాజు నాయక్, రాజుపాళెం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ మాట్లాడారు. అనంతరం వారితోపాటు ఎస్‌ఐలు మంజునాథ, హేమలత, శివప్రసాద్, ఏఎస్‌ఐ మధుసుదన్ రెడ్డి, రిటైర్డ్ పోలీసులు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.

అంకిత భావంతో..

బద్వేలు అర్బన్ : హెచ్‌డబ్ల్యూఓగా బాలమ్మ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అంకిత భావంతో విధులు నిర్వర్తించారని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ–2 బాలికల వసతిగృహం హెచ్‌డబ్ల్యూఓ బాలమ్మ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓలు రామయ్య, రామాంజులు, దిలీప్‌బాషా, హెచ్‌డబ్ల్యూఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, తాలూకా నాయకులు బాలుడు, మధుసూదన్‌రెడ్డి, సుభాష్, హరి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి

బి.కోడూరు : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోరుమామిళ్ల మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తంగేడుపల్లెలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ కీటక జనిత వ్యాధులపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, దోమల లార్వా నియంత్రణ, మలేరియా తదితరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రోహిణి, ఏఎన్‌ఎం శాంతకుమారి, ఆశా కార్యకర్త సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.

